# మాతృప్రేమ

నిశ్శబ్దం. ఎంతో నేర్చుకున్నాను, ఈ నిశ్శబ్దంలోంచి.

నాకు నేనే ఓ విమర్శకురాలిలాగా మారిపోయాను. ఆలోచించే శక్తి వచ్చింది. విషాదంలో భాష మూగపోతోంది. అదే జరిగింది. మా విషయంలో, నిశ్శబ్దం. దానికింత శక్తి ఉందని, నీలిమ ఈ యిల్లు దాటాకే తెలిసింది. ఈ నిశ్శబ్దం ఓ విశ్వ విద్యాలయం. ఇందులో ఉంటున్నది నేను, నిశాంత్ మాత్రమే. అయితే నాకు పుస్తకాలు, నిశాంత్‌కి మందు తోడు. ఒకప్పుడు నీలిమ ఉండేది. ఇప్పుడు ఆమె జ్ఞాపకాలు, అవి చేసిన గాయాలు కూడా మా నీడల్లాగా మా ప్రపంచంలో ఉంటున్నాయి.

మాదంటూ ఓ అద్భుత ప్రపంచం ఉండేది. దాన్నిండా కలలు. ఆ ప్రపంచం అంతా నీలిమ. ఆమె ఓ కేంద్రం. మా జీవితాలు నీలిమ చుట్టూ తిరిగేవి. నీలిమ వెళ్ళిపోయాకా, మా జీవితాలు ఆగిపోయాయి.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఫోన్ మోగింది. పుస్తకం చేతిలో ఉంచుకునే ఎడం చేత్తో ఫోన్ తీసాను.

"మమ్మీ!"

ఒళ్ళంతా విద్యుత్ పాకినట్లుగా అనిపించింది.

నీలిమ గొంతులాగా ఉందేంటే? లేకపోతే నాకలా అనిపిస్తోందా! భ్రమా!

"మమ్మీ !"

కళ్ళు తిరుగుతున్నట్లుగా అనిపించింది.

బలవంతంగా వర్తమానంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నాను.

గొంతువస్తుందా! మాట్లాడ్డానికొస్తుందా!

అతి కష్టం మీద 'హలో' అన్నాను.

అవతలి వైపు నుంచి నిశ్శబ్దం.

మళ్ళీ హలో అందామని అనుకున్నాను. అనలేదు. కట్ అయింది. అయితే, ఆ గొంతు నీలిమదే. ఎన్నేళ్ళయినా గుర్తు పట్టగలను. ఎలా మర్చిపోగలను. చిన్నప్పట్నించి వింటున్న గొంతు ఏది నీలిమ !

జీవితాన్ని ఎలాగైనా, ఎక్కణ్నించి అయినా మొదలు పెట్టచ్చు అని అనుకుందేమో, అందుకే యిల్లు వదిలి వెళ్ళిపోయింది. వెళ్ళి ఎన్ని రోజులైంది? పద్నాలుగు నెలలు పదిరోజులు.

మళ్ళా ఫోన్

"మమ్మీ! ......" కట్ అయింది. మళ్ళా నిశ్శబ్దం.

ఈసారి నన్ను నేను అదుపులోకి తెచ్చుకున్నాను. హలో అని చాలా సార్లే అన్నాను. కాని, లాభం లేకపోయింది.

నీలిమ కనపడ్తే ఎన్నో ప్రశ్నలు అడగాలనుకున్నాను. అవన్నీ ఒక్కసారిగా నా ముందుకొచ్చాయి. ఎందుకు యింట్లోంచి అంత చీఫ్‌గా వెళ్ళిపోయావ్? మమ్మల్నెందుకు వదిలేసావ్? నీ ప్రేమ గురించి మాకెందుకు చెప్పలేదు? మమ్మల్ని మోసం ఎందుకు చేసావ్?

ఏదో బాధ ఉండలు చుట్టుకుపోతోంది.

నీలిమ గురించిన రకరకాల భావాలు, ఆలోచనలు, జ్ఞాపకాలు చుట్టుముట్టున్నాయి. ఫోన్ పెట్టేసి అలాగే సోఫామీద, కళ్ళకి చెయ్యి అడ్డుపెట్టుకుని వాలిపోయాను.

జీవితంలో అత్యంత దురదృష్టకరమైన రోజు .....

ఆ రోజు.... నీలిమ యిల్లు వదిలి వెళ్ళడానికి ముందురోజు....

నీలిమ పుట్టిన రోజు.....

ముగ్గురం ఆఫీసులకి సెలవ పెట్టేసాము.

బిర్లామందిర్ కెళ్ళాము. లైఫ్‌స్టైల్ లో ఏవేవో కొన్నాము.

తానిష్క్‌లో ఓ సింపుల్ నెక్లెస్ కొన్నాము. అందులో ఉన్న వజ్రాల మెరుపు, నీలిమ మొహంలో ప్రతిబింబిస్తూంటే మురిసిపోయాము.

గ్రీన్ పార్క్‌లో లంచ్ చేసాము. యింటి కొచ్చేప్పటికి మూడు. ఫోన్ మోగుతూనే ఉంది. గ్రీటింగ్స్ వస్తూనే ఉన్నాయి.

"మా ఆఫీసులో వాళ్ళకి పార్టీ యిస్తున్నాను. సంగీత్‌లో పిక్చర్, బసేరాలో డిన్నర్"

జీన్స్, టీషర్ట్‌తో కారు తాళాలు ఊపుతూ అంది నీలిమ.

"ఓ.కే. బాయ్!" అంటూ చెయ్యూపింది. కూతుర్ని మురిపెంగా చూస్తూండిపోయాను.

రాత్రి పొద్దుపోయింది. నిశాంత్‌కి రోజు ముందు కావాలి. అది లేక పోతే నిద్రపట్టదు. రోజు ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు ఫ్రెండ్స్‌తో బార్ కెళ్ళి తాగి వస్తాడు. సాయంత్రం ఫ్రెండ్స్ తో తాగకపోతే, యింట్లోనే గది తలుపులు వేసుకుని తాగుతాడు. ఇప్పుడు అదే పనిలో ఉన్నాడు. నాకు సీరియల్స్ ఉండనే ఉన్నాయి. ఛానల్స్ అన్నీ మారుస్తూ టీ.వీ. చూసి పదిన్నరకి లేచాను అక్కణ్ణించి.

అన్నం తినబుద్ధికాలేదు. మజ్జిగ తాగి, నిశాంత్ గదిలోకి తొంగి చూసాను. టీ.వీ. చూస్తూ, ఏదో తింటూ తాగుతున్నాడు.

"అన్నీ టేబుల్ మీద పెట్టాను. మీ యిష్టం ఎప్పుడు తిన్నా సరే"

తల తిప్పకుండానే "ఊఁ" అన్నాడు.

మందెక్కువయితే మాట్లాడడు. అర్థం చేసుకున్నాను.

"నేను పడుక్కొంటున్నాను." అంటూ గదిలోకి వెళ్ళి తలుపు దగ్గరేసుకున్నాను. రేడియోలో శుభరాత్రి. విన్నాక పడుకొన్నాను.

"మమ్మీ! పడుకొన్నావా!" అంటూ నీలిమ వచ్చింది. అప్పుడే

"ఇప్పుడే పడుక్కుంటున్నాను. బాగా ఎంజాయ్ చేసావా!"

కారు తాళాలు, యింటి తాళం, తళాలున్న అరలో పెట్టింది.

"డాడీ పడుకున్నారా!"

"తన స్టడీరూంలోనే ఉన్నారు. గుడ్‌నైట్ చెప్పి పడుక్కో"

"ఓ.కే. గుడ్‌నైట్ మమ్మీ," అంటూ దగ్గరి కొచ్చి నా భుజం మీద చిన్నగా తట్టింది. నా చేతితో నీలిమ చెయ్యిని నొక్కాను.

నీలిమ వెళ్ళింది. మరో పావుగంటకి నిశాంత్ వచ్చి పడుకున్నాడు

మర్నాడు....

అలారం ఐదుగంటలకే మోగింది.

నిశాంత్‌ని, నీలిమని లేపాను. ఎవరి తాళాలు వాళ్ళు తీసుకుని వాకింగ్‌కి బయల్దేరాం. ఒకళ్ళకోసం ఒకళ్ళు ఎదురుచూడకుండా ఎప్పుడైనా యింటికెళ్ళడానికి వీలుగా ఈ పద్ధతి పెట్టుకున్నాం.

యూనివర్శిటీ రోడ్డు మనుషులతో, చెప్పుల చప్పుళ్ళతో కోలాహలంగా ఉంది.

'లావణ్యా! ఇవ్వాళ్టికెక్కువ దూరం వెళ్ళద్దు. నేను తొందరగా వెళ్ళాలి. ముంబై నుంచి పిక్సి వచ్చి 'రమాదా'లో ఉన్నాడు. ఏడుగంటలకి వాణ్ణి పికప్ చేసుకుని ప్లాంట్‌కి వెళ్ళాలి. టి.పి. ఎం. సెమినార్లున్నాయి.

"నేను కూడా తొందరగా వెళ్ళాలి. నిన్న పుట్టినరోజని వెళ్ళలేదు కదా, పెండింగ్ పని చాలా ఉంటుంది. "గబాగబా నడవడం మొదలెట్టింది నీలిమ.

'లా' కాలేజి వరకు వెళ్ళి వెనక్కి వచ్చేసాము. నీలిమ గురించి పట్టించుకోలేదు.

వస్తూ వస్తూ, దార్లోనే ఆలోచించుకున్నాను. బ్రేక్‌ఫాస్ట్, లంచ్ కట్టుకోవాల్సిన చీర గురించి.

యింట్లోకి వస్తూనే ఫ్రిజ్‌లోంచి ఇడ్లీ పిండి, కొబ్బరి చిప్ప బటయి పెట్టాను. రేడియో ఆన్ చేసాను. వందేమాతరం వస్తోంది.

కాఫీ కలిపి, బాల్కనిలోకి వెళ్ళాను. అప్పటికే అక్కడ నిశాంత్ కూచుని ఉన్నాడు.

"రాత్రి పొద్దుపోతుంది. ప్రయాణం విసుగు. కానీ తప్పదు. ఎండి కూడా వస్తే, ఆ పక్కనే ఓ చిన్న సిమెంట్ ఫాక్టరి చూడ్డానికెళ్ళాల్సి వస్తుంది. పవర్ లేక, కోల్ లేక దాన్ని అమ్మేద్దామనుకుంటున్నారట. అక్కడికి కూడా వెళ్తే రాత్రి ఒంటిగంట అయిపోతుంది. ఈ విజయవాడ హైవే రోడ్లు చూస్తే హార్రిబుల్. ఫ్! ఒళ్ళు హూనం అయిపోతుంది. గుడ్డిలో మెల్ల ఇండికాలో వెళ్తున్నాం. క్వాలిస్ కాదు." అంటు నిశాంత్ తన కష్టాలు చెప్పుకున్నాడు.

"భక్తిరంజని అయిపోయింది, ఈ పిల్ల రాలేదే! అంటూనే నేను లేచి వంటింట్లోకి వెళ్ళి మధ్యాహ్నానికి ఏం తీసుకెళ్ళాలా అని ఆలోచించాను. నిశాంత్‌కి లంచ్ అక్కర్లేదు. నీలిమకి మధ్యాహ్నం సూప్, సలాడ్, నా వంట అక్కర్లేదు. మరి నా ఒక్కదానికి ఎందుకు? నేను కూడా ఎక్కడో ఏదో తినేస్తాను. అని అనుకుని గదిలోకి వెళ్ళి బీరువా తెరిచి, తెలుపు గులాబి ప్రింట్ ఉన్న ఆర్గాండి చీర తీసి మంచం మీద పడేసి బాల్కనిలోకి వెళ్ళాను.

"నీలిమ రాలేదే !" అంటూ వంగి రోడ్డు వైపు చూసాను.

'వస్తుందిలే. కొంచెం కాఫీ యిస్తావా! తాగేసి షేవ్ చేసుకుంటాను'

"రోజూ ఈ టైముకి వచ్చేదేనే, ఇంకా రాలేదు. నాకేంవిటి, దానికే లేట్ అవుతుంది."

"నీ కంతా కంగారు. లేడీస్ హాస్టల్ దగ్గర ఎవరైనా ఫ్రెండ్స్ కనపడ్తే మాట్లాడుతూండి పోయి ఉంటుంది. వస్తుందిలే."

రెండుసార్లు బాల్కని లోకి వచ్చాను.

రోడ్లో మనుషుల రద్దీ ఎక్కువైంది.

కార్లు, స్కూటర్లు, ఆటోలు అటూ యిటూ రయ్యిమంటూ వెళ్ళిపోతున్నాయి. ఎందుకో నెగెటివ్‌గా ఆలోచనలు వస్తున్నాయి.

"నీ టైము వేస్టవుతోంది. నువ్వు తయారవ్వు.... దాని దగ్గర కూడా కీస్ ఉన్నాయిగా. నువ్వు వెళ్ళిపోయినా, దాని దగ్గర తాళం చెయ్యి ఉంది కదా, నీ పని నువ్వు చేసుకో ! తనే వస్తుందిలే."

నిశాంత్ మాటలు పట్టించుకోకుండా బెడ్‌రూం కిటికి లోంచి బయటికి చూసాను. నీలిమ కనపళ్ళేదు. టైము ఏడు. ఎందుకు రాలేదు. ఏదైనా యాక్సిడెంట్ ....! ఊహుఁ ... అదే జరిగితే ... ఈ పాటికే తెలిసిపోతుంది. మార్నింగ్ వాక్ కి వచ్చేవాళ్ళంతా అంతో యింత పరిచయం ఉన్నవాళ్ళే. అది అయ్యి ఉండదు. ఆర్ట్స్ కాలేజీ మెట్ల మీద కూచుని ఏదో డిస్కషన్ చేస్తూండి ఉంటుంది. అయినా, ఈ రోజు ఆఫీసుకి వెళ్ళదా! 'వెళ్ళను' అని ముందే చెప్తే ఇంత టెన్షన్ ఉండదు కదా!

నిశాంత్ తయారు అయిపోయి, బ్రీఫ్‌కేస్, కారు తాళాలు తీసుకుని తలుపు తియ్యబోతూ ఆగాడు.

"లావణ్యా! నీలిమ రాలేదు. నాకు ఎలాగో ఉంది. నువ్వు యింట్లో ఉండాల్సివస్తుందేమో! ఓ అరగంట తర్వాత ఫోన్ చేస్తాను. నాక్కూడా ఏం జరిగిందో తెలుస్తుంది. మరి నే వెళ్ళనా!"

బెంగగా చూసాను.

"చిన్న పిల్లకాదు. దానికేం కాదు. రమదా కెళ్ళంగానే ఫోన్ చేసాను. కారు ఆఫీసులో పెట్టాను. నాకు దార్లో ఎక్కడైనా కనపడ్తే తొందరగా యింటి కెళ్ళమని చెప్తాను. కంగారుపడకు" అంటూ వెళ్ళిపోయాడు.

లలిత సంగీతం వస్తోంది ఎనిమిది అయిపోతుంది. ఎనిమిదన్నరకల్లా ఇంజనీరింగ్ కాలేజి బస్టాప్ దగ్గరుండకపోతే, ఆఫీసుకి టైముకి చేరడం కష్టం అన్నిచోట్లా ట్రాఫిక్ ఎక్కువ.

ఏం తినబుద్ధి కాలేదు. అసలేం చెయ్యలేదు. జడ వేసుకుందామని అద్దం ముందు నుంచున్నాను.

చీరని పొందిగ్గా కట్టుకుని, ముందుకి వెనక్కి చూసుకుంటూ పొట్టి జుట్టుని క్లిప్‌లో బిగిస్తూంటే, టీ. వి మీద రెప రెప లాడుతున్న లేత గులాబి రంగు కాయితం కనపడింది. దాని మీద రూం రిఫ్రెషనర్ లేకపోతే, కిటికీ లోంచి వచ్చేగాలికి ఎప్పుడో ఎగిరిపోయేది. పొట్టి జుట్టుని అలాగే వదిలేసాను. గిరుక్కున వెనక్కి తిరిగి, ఆ కాయితం తీసాను. నీలిమ రాత. గుండె జారినట్లుంది. ఏం రాసింది? ఎందుకు ఉత్తరం రాయాల్సి వచ్చింది? ఏం జరిగింది?

గబగబా మా బెడ్‌రూంలోకి వచ్చాను.

ఓ ఐదు నిమిషాలు కళ్ళు మూసుకున్నాను.

నన్ను నేను స్వాధీనంలోకి తెచ్చుకున్నాను.

ఉత్తరం చదవడం మొదలెట్టాను.

మమ్మీ, డాడీ !

మిమ్మల్ని బాధపెడ్తున్నానని తెలుసు. కానీ, నేనేం చెయ్యలేను. నా గురించి, నా పెళ్ళి గురించి మీరు చాలా పెద్ద ఊహలు పెంచుకున్నారు ఆశలు పెట్టుకున్నారు. నా నోటితో చెప్పి, మీరు బాధపడ్తూంటే చూడలేక ఉత్తరం రాస్తున్నాను.

నాకు మితేష్ అంటే యిష్టం. మితేష్ నాతో పాటూ జి.ఈ లో పనిచేస్తున్నాడు. మా షిఫ్ట్‌లో పరిచయం పెళ్ళి వరకూ వచ్చింది. మీరు నాకు అమెరికా సంబంధం చూస్తున్నారు. ఎన్ని లక్షలయినా కట్నం యివ్వడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ, నేను మీరు తెచ్చిన సంబంధం చేసుకుని అమెరికా వెళ్ళడానికి సిద్ధంగా లేను. నేను వేరే ఎవర్ని భర్తగా ఊహించలేదు. మీకేమో మితేష్‌ని అల్లుడిగా చూడడం యిష్టం ఉండదు. మీరు అంగీకరించరు. నావల్ల, నా పెళ్ళి వల్ల మీరు అమెరికా చూడాలని మీ ఆశ. ఎందుకంటే మీ చుట్టూ ఉన్న వాళ్ళంతా అమెరికా వెళ్ళి వచ్చినవాళ్ళే.

మీ ఫ్రెండ్స్, వాళ్ళ అమ్మాయిల డెలివరీలకోసం అనో, పిల్లల్ని చూడడం కోసమో, బేబి సిట్టింగో, ఏదయితేనేం రెండు మూడు సార్లు వెళ్ళి వచ్చారు. మీరు అమెరికా వెళ్ళాలన్న కోరిక నా అమెరికా పెళ్ళి సంబంధం వల్లనే అవుతుంది. అదే జరగాలంటే అతను మితేష్ అనకూడదు. సింపుల్ మీకు నా పెళ్ళి మితేష్‌తో అవడం యిష్టం ఉండదు. నన్ను ఇమోషనల్‌గా బ్లాక్‌మెయిల్ చేస్తారు. నాకదంతా యిష్టం లేదు.

మీకు నేను సంతోషంగా ఉండడమే కదా కావాల్సింది నాసంతోషం అంత మితేష్. రెండు నెల్ల నుంచి వేస్తున్న ప్లాన్ యిది. నా బట్టలు అన్ని కొంచెం కొంచెంగా, అప్పుడప్పుడు తీసుకెళ్ళి మితేష్ ఫ్లాట్‌లో పెడ్తూ వచ్చాను. అందుకే పొద్దున్న వాకింగ్‌కి వెళ్ళేటప్పుడు, ట్రాక్ సూట్ వేసుకోలేదు. డ్రెస్ వేసుకున్నాను. నేను ఏ.పి.లో వెళ్ళిపోతున్నాను. పొద్దున్న కొంచెం దూరం నడిచి, ఆటో తీసుకుని స్టేషన్ కెళ్ళి, అక్కడ మితేష్‌ని కలుసుకుని, ఏ.పి.లో ఢిల్లీ వెళ్ళి, అక్కణ్ణించి గుర్‌గావ్‌లోని జి.ఈ. లో నేను చేరుతాను మితేష్ ముందరే జాయినయిపోయాడు.

మీరు పోలీసులు రిపోర్టు యిచ్చి లాభం లేదు. కాబట్టి యివ్వద్దు. నా యిష్టం మీదే వెళ్తున్నాను. నాకు నచ్చిన వాడితో వెళ్తున్నాను. నేను మేజర్నన్న సంగతి మరిచిపోవద్దు. నేనే మీకు ఫోన్ చేస్తాను. బాధ కలిగిస్తే క్షమించండి.

నీలిమ

మంచం మీద వాలిపోయాను.

ఓ మైనారిటీ తీరిన పిల్ల తనకు నచ్చిన వాణ్ణి, యింట్లో చెప్పకుండా, వెళ్ళిపోయి పెళ్ళిచేసుకుంటే, సినిమాలో బావుంటుందేమో, నిజ జీవితంలో ఎంత అవమానం ! మింగుడు పడని చేదుమాత్ర ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన వచ్చింది. ధైర్యం చాల్లేదు.

ఆఫీసులో ఎంతో గర్వంగా, ఎప్పుడూ నీలిమ గురించే గొప్పలు చెప్తూ, అందరి కళ్ళల్లో ఈర్ష్య చూసి పొంగిపోయిన నేను, ఈ రోజునుంచి, హేళన, అపహాస్యం ఎలా చూడగలను?

ఇద్దరం ఉద్యోగాలు మానేసాం. మా యిద్దరి మధ్య మాటలే లేవు. ఎక్కడ జరిగింది తప్పు ?

హాయిగా సాగిపోతున్న జీవితాల్ని ఎందుకు చిందర వందర చేసింది?

టప్పున ఓ బండరాయిని విసిరేసి మా జీవితాల్ని అల్లకల్లోలం ఎందుకు చేసింది?

నా జీవితాన్ని నేను, నాకు నచ్చినట్లుగా చేసుకునే అధికారం నాకే ఉంది. కేవలం నాకు మాత్రమే ఉంది. మీకే లేదు. అని పరోక్షంగా చెప్పి వెళ్ళిపోయిందా!

నిజం కూడా అదేనా!

ఎలా అయితే నీలిమ జీవితం బావుంటుంది? ఏం చేస్తే నీలిమ ఆనందంగా ఉంటుంది ! ఏది బెస్ట్ ! అందరి కన్నా ఓ మెట్టు పైనే ఉండాలనుకుని, ఎంతో ఖరీదయిన బట్టలు కొనేదాన్ని !

నీలిమ మా కలల ప్రపంచం. మా ఒక్కొక్క కలా ఆమె వల్ల తీర్చుకునే వాళ్ళం.

దాని యిష్టాయిష్టాలు ఏనాడూ అడగలేదు.

ఎక్కడ ఎస్సే రైటింగ్ పోటీ ఉన్నా, డిబేట్ ఉన్నా పెయింటింగ్ ఉన్నా, క్విజ్ ఉన్న నేనే స్వయంగా తీసుకెళ్ళేదాన్ని అన్ని విధాల ప్రిపేర్ చేయించే దాన్ని . నీలిమకి ప్రైజ్ వస్తే నాకు వచ్చినంతగా సంతోషపడేదాన్ని. రాకపోతే దానికన్నా నేనే ఎక్కువ బాధపడేదాన్ని.

ప్రతీసారి, ఎండకాలం సమ్మర్ కాంపుల్లో చేర్పించే దాన్ని.

'మా నీలిమకి రాని విద్య లేదు' అని అందరూ పొగడుతూ ఉంటే నా జీవితం పరిపూర్ణత చెందినట్లుగా అనిపించేది.

వ్యక్తిత్వ వికాసం కోర్సులకి పంపించాను. కానీ, దాని వ్యక్తిత్వం, బూమరాంగ్‌లాగా నాకే తిప్పి కొడ్తుందని అనుకున్నానా!

రోజులు ఎప్పుడూ కూడా ఓ లాగానే ఉంటాయనుకోడం ఎంత తెలివి తక్కువతనం!

ఏ రోజున కూడా అనుక్కోలేదు. అసలు ఆ ఊహ కూడా రాలేదు. ఇది పెరిగి పెద్దదయి మా జీవితాన్ని తొక్కేసి ఓ మూలకి తోసేస్తుందని!

ఇంత నిర్దాక్షిణ్యంగా మా జీవితాల మీద నుంచి వెళ్ళిపోతుందని అనుక్కోలేదు.

ఎవ్వరి ముందు కూడా నీలిమకి కాంప్లెక్స్ రాకూడదని, ఎంత జాగ్రత్తగా పెంచామో.... అంత నిర్లక్ష్యంగా, కటువుగా, అందరిలో మా జీవితాల్ని చులకన చేసి వెళ్ళిపోయింది. అశాంతిలో అవమానాల్ని ఎదుర్కోమని వెళ్ళిపోయింది.

వెళ్ళిన ఓ నెలకి ఫోన్ చేసింది. బాగా తిట్టి ఫోన్ మరోసారి చెయ్యద్దని చెప్పి ఫోన్ పెట్టేసాను. ఆ తర్వాత చెయ్యలేదు. కానీ.... నేనే రోజూ నాకు తెలీకుండానే ఎదురు చూసేదాన్ని. ఏదో ఓ రోజు ఫోన్ చేస్తుంది నా దగ్గరికొస్తుంది. అన్నింటికీ మమ్మీ .... మమ్మీ అనే దానికి ఎంత ధైర్యం వచ్చింది? కారణం మితేష్ !

ఏం నమ్మి అమితేష్‌తో వెళ్ళింది? మంచివాడేనా! ఎంత చదువుకున్నా, ఎన్ని తెలివి తేటలున్నా ప్రకృతిపరంగా స్త్రీ ఎప్పుడూ అబలే. అందుకే శారీరక రక్షణ ఒంటరిగా బయటికి, యిల్లు వదిలి వెళ్ళినపుడు కొంచెం తక్కువే. ఎలా ఉందో ...

ఎందుకిలా జరిగింది? వాస్తవ జ్ఞానం .... అసలు ఆ భాగం పని చెయ్యకపోతే యిలాగే ఉరిబాయూ పోకడలు ! ఈ సినిమా ప్రభావం యింత ఉందా ఈ పిల్ల మీద.

టీ.వీ. ఛానెళ్ళకి కళ్ళని కట్టేసి, మనసుని ఎదగక తనంతట తానుగా ఎదగకుండా చేసుకుంటే యిలాగే ఉంటుందా పర్యవసానం !

వ్యక్తిత్వం లేదు నిపుణత లేదు. దీని చదువు దీనికి ఏం నేర్పింది? ఏం చెయ్యాలో తెలియడం ఎంత జ్ఞానమో, ఏం చెయ్యకూడదో తెలీడం అంతకు మించిన విద్వత్తు.

మా జీవితంలో ఏం పోయింది? ఫీల్. మా అనుభూతులు పోయాయి. ఈ జీవితాన తలుపులు తట్టేవి నీలిమ జ్ఞాపకాలు మాత్రమే.

తన అనుభవ రాహిత్యంతో. ఆలోచనా శూన్యంతో మా జీవితాల్కి ఓ పెద్ద బ్రేక్ వేసి, ఆపేసి వెళ్ళిపోయింది.

మా కన్నీళ్ళని మేమే తుడుచుకునే స్థితికి వచ్చేసాము. మనోశూన్యత. గతానికి, వర్తమానానికి వంతెన కట్టాలని చూస్తున్నా.

మా యిద్దరి తప్పు ఎంతుంది? తల్లితండ్రులిద్దరూ ఉద్యోగం చెయ్యడం దానికి మితిమీరిన స్వేచ్ఛనిచ్చిందా! స్వేచ్ఛ అంటే మంచి చెడుకి అర్థం లేకుండా ప్రవర్తించడమా!

వాస్తవంలోని వెలుగుని చూడ్డానికి శక్తి చాల్లేదు. ఎంత నిర్వీర్యురాల్ని అయ్యానో!

విశబ్ద పాషాణంలా జీవితాన్ని దగ్గర్నుండి చూడ్డానికి ప్రయత్నిస్తున్నాను.

మళ్ళా ఫోన్. కదల్లేదు.

ఫోన్ మోగుతోంటే.... నిశాంత్ గదిలోంచి పేపరులో సహా బయటకి వచ్చాడు.

ఫోన్ తియ్యమన్నట్లు చెయ్యూపాడు.

నన్ను నేను అదుపులోకి తెచ్చుకున్నాను

మెల్లగా రిసీవర్ తీసి 'హలో' అన్నాను.

'మమ్మీ!' నీలిమే ..... సందేహం లేదు. నా చెవులకి సరిగ్గానే వినపడింది.

కోపం లేదు. మొదట్లో ఉన్న కోపం ఏదీ? గుండెల్లో యిన్నాళ్ళు పేర్కొన్న బాధ, కళ్ళలోంచి జారిపోతోంది.

"అమ్మా!" ఆ పిలుపు నా గుండెల్లోని లోతుల్ని స్పృశించింది అందులోని పసితనం కట్టేసింది.

"అమ్మా!" మాట్లాడవా ! ఎందుకో ఒంటరిదాన్నయినట్లుగా అనిపిస్తోంది. నీ భుజాన్ని ఆసరాగా యిస్తావా! ఏం అమ్మా! మాట్లాడవా !

ఉండలు చుట్టుకుపోతున్న బాధ, గొంతుకలో అడ్డుకుపోయింది.

నోట్లోంచి మాట రావడం లేదు.

"అనుమతి లేకుండా వెళ్ళింది. యిప్పుడు వస్తానంటోంది అని అనుకుంటావా!"

"కాదు.... కాదు .... లేదు.... " బలవంతంగా అనగలిగాను.

"నేను... మితేష్ విడిపోయాం .... భిన్న వాతావరణంలో పెరిగిన మా యిద్దరికీ మధ్యనున్నది కేవలం ఆకర్షణ మాత్రమే అని తెలియకుడానికి యిన్ని రోజులు పట్టింది."

ఏదో సాధారణ విషయంలా చెప్పాలనుకున్నా ఆ గొంతులో వణుకు తెలిసిపోతోంది.

ఆ రోజున తెలీని జీవితంలోకి, అనుభవం లేని, తియ్యటి ఊహల్తో వెళ్ళిపోయింది.

ఈ రోజున వైవాహిక జీవితం లోని, జీర్ణించుకోలేని చేదు అనుభవాల్తో వస్తోంది.

పిల్లలు ఏం చేసినా, ఎంత చేసినా, ఎంత బాధపెట్టినా, ఏంత అవమానించినా, ఎంత అసహ్యంగా ప్రవర్తించినా, ఎంత విచక్షణా రహితంగా ప్రవర్తించినా వాళ్ళని తల్లి ఒకత్తే క్షమించ'లదు. వేదాంత కాదు. ఇది వాస్తవం.

"వచ్చెయ్యి.... పర్మిషన్ అడగక్కర్లేదు .... నీకు తెలుసా నీలూ ... నువ్వెళ్ళిన రోజున ఆగిపోయిన జీవితం తిరిగి నీ రాకతోనే మొదలవుతుంది. నా భుజం కావాలనుకుంటావా! పిచ్చిదానివి, నా రెండు చేతులెందుకనుకున్నావ్? నేనూ, డాడీ నీ కండా దండా తిరిగి ఎలాంటి జీవితాన్ని ఆరంబించినా, మంచి మార్గాన్నే వెళ్ళడానికి మా మోరల్ సపోర్ట్ నీకుంటుంది. మాకు నువ్వు ..... నీకు నేను ... జీవితం అంటే మితేష్‌తో పంచుకోవడం ఒక్కటే కాదు ..... ఎంతో ఉంది..... నీరాక కోసం ఎదురుచూస్తుంటాము."

ప్రశ్నార్థకంగా చూస్తున్న నిశాంత్‌లో అంది "నీలిమ ..... మన నీలిమ ..."

నిశాంత్ పెదవుల మీద చిన్న హాసం.

❖ ఆకాశవాణి ప్రసారం ❖

❖❖❖